క్లుప్తంగా

ట్రాఫిక్ బోర్డుల బహూకరణ



ట్రాఫిక్ బోర్డులు పోలీసులకు అందిస్తున్న దాత శ్రీనివాస్

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కారం కోసం రోడ్డుకు మధ్యలో ఏర్పాటు చేసే ట్రాఫిక్ బోర్డులను పట్టణంలోని వంశీ ఏజెన్సీస్ కంపెనీ సభ్యులు పోలీసులకు అందజేశారు. బుధవారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద పట్టణ సీఐ దారావత్తు రాంబాబుకు కంపెనీ సభ్యులు గుమ్మళ్ల శ్రీనివాసు అందజేశారు. సీఐ రాంబాబు మాట్లాడుతూ దాతల సహకారంతో ట్రాఫిక్ బోర్డులను అందివ్వడం అభినందనీయమని అన్నారు. ఈ బోర్డులను పట్టణంలో రద్దీగా ఉన్న మార్గాల్లో ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యను పరిష్కరించుకోగలమన్నారు. ఈ సందర్భంగా దాత శ్రీనివాస్‌ను అభినందించారు. పట్టణ ఎస్సై బాదం శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఎస్సై కృష్ణమూర్తి, ఏఎస్సై మద్దాల శివాజీ, కోదండరామయ్య తదితరులు అభినందనలు తెలియజేశారు.

ఎస్సై ముత్యాలరావుకు సత్కారం



ఎస్సై ముత్యాలరావును సత్కరిస్తున్న సీఐ రాంబాబు, పోలీసు సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: పట్టణ ఎస్సై ఎస్.ముత్యాలరావు సేవలు అభినందనీయమని సీఐ డి.రాంబాబు కొనియాడారు. బుధవారం బదిలీలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు వెళ్తున్న ముత్యాలరావును పట్టణ పోలీసులు ఘనంగా సత్కరించారు. పలువురు మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తూ పట్టణంలో పేరు ప్రఖ్యాతలు సాధించుకున్న ముత్యాలరావు సేవలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్సై బాదం శ్రీనివాసరావు, కృష్ణమూర్తి, ఏఎస్సైలు మార్‌లింగం, శివాజీ, జానకిరామయ్య, ఏసుబాబు పోలీసులు అభినందనలు తెలియజేశారు.

కాలుష్యాన్ని నియంత్రించాలి

పోడూరు: పర్యావరణ పరిరక్షణ కోసం వాతావరణంలో కాలుష్యాన్ని నియంత్రించాల్సిన అవసరం ఎంతో ఉందని మట్టపర్రు వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షులు కొల్లాబత్తుల రవికుమార్ అన్నారు. మట్టపర్రు ఏఏ పేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం 'గోదావరి పర్యావరణ పరిరక్షణ సమితి' (జీపీపీఎస్) ఆధ్వర్యంలో స్థానిక నాయకులు మొక్కలు నాటారు. జీపీపీఎస్ అధ్యక్షులు వారణాశి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బి.చిట్టిబాబు, జిన్నూరు సొసైటీ డైరెక్టర్ పెచ్చెట్టి ముత్యాలరావు, మాజీ ఉప సర్పంచ్ కుసుమె సుభాకర్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలను వినియోగించుకోవాలి

పాలకొల్లు అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను రోగులు వినియోగించుకోవాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ చెప్పారు. బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ బాటలో పయనిస్తూ ప్రతి పౌరుడికీ ఉచితంగా విద్య, విద్య అందిస్తున్నారని ఆయన వెల్లడించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో డాక్టర్లు చంద్రశేఖర్, గంగాభవాని, సునీత 435 మంది రోగులను పరీక్షించి, మందులను ఉచితంగా అందజేశారు. రక్తహీనతతో బాధపడుతున్న ఒక మహిళను ఆరోగ్యశ్రీలో వైద్యం అందించడానికి సిఫార్సు చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, యూత్ నాయకులు గుడాల సాయిబాలాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

పెనుమంట్ర: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ పదవ తరగతి విద్యార్థులకు సరఫరా చేస్తున్న స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి విద్యార్థులకు సూచించారు. బుధవారం మార్టేరు శ్రీవేణుగోపాల ఉన్నత పాఠశాలలో స్టడీమెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఎంపీడీఓ పద్మజ మాట్లాడుతూ నెగ్గిపూడి, మార్టేరు, ఆలమూరు,మాముడూరు, జుత్తిగ, పెనుమంట్ర గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 252 మంది ఇంగ్లీష్, 169 మంది తెలుగు మీడియం విద్యార్థులకు మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

మార్టేరులో వికసిత్ భారత్

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు , సత్యవరం సచివాలయాల్లో ఆయా గ్రామ సర్పంచ్‌లు మట్టాకుమారి, సీహెచ్ సునిత అధ్యక్షతన బుధవారం వికసిత్ భారత్ కార్యక్రమాలు నిర్వహించిన మార్టేరు జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను ప్రజలకు తక్కువ సమయంలో అందజేస్తున్న ఘనత ఆంధ్రప్రదేశ్ దేనని గుర్తు చేశారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైద్యానికి పెద్దపీట



మునమర్రులో పంచాయతీ అదనపు ఫ్లోర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



వల్లూరులో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైద్యానికి పెద్దపీట వేస్తున్నామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం పెనుగొండ మండలం మునమర్రులో రూ.15 లక్షలతో నిర్మించిన పంచాయతీ అదనపు ఫ్లోర్‌ను, రూ.8.3లక్షలతో నిర్మించిన కల్వర్టు ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునమర్రు గ్రామానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేశామని, త్వరలోనే గ్రామంలో వైద్యులు విధులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి గ్రామీణ ప్రాంతాల్లోనూ నాణ్యమైన వైద్యం అదించాలన్న లక్ష్యంతో సీఎం జగన్ కంకణం కట్టుకున్నారన్నారు. ఇప్పటికే పెనుగొండలో సీహెచ్‌సీ, సిద్ధాంతంలో పీహెచ్‌సీ ఉండగా, మునమర్రులో మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేశామన్నారు. గ్రామాభివృద్ధిలో సర్పంచ్ తోట వెంకట నాగరత్నం కృషి మరువలేనిదన్నారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాధ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోనూ అభివృద్ధి పరవళ్లు తొక్కించడం మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకే దక్కుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆచంట నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పెనుగొండ మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి, సర్పంచ్‌లు తోట వెంకట నాగరత్నం, మాకినీడి కోట సత్యనారాయణ, దంపనబోయిన రూప, యర్రంశెట్టి బుజ్జి, నల్లూరి సత్యనారాయణ, పార్టీ నాయకులు పెన్మెత్స విశ్వనాథరాజు, నల్లిమిల్లి బాబిరెడ్డి, దంపనబోయిన బాబూరావు, చిన్నం రామిరెడ్డి, కాకిలేటి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

పెనుగొండ: భారత దేశ చరిత్రలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం ఆచంట మండలం వల్లూరు, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురంల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. నాడు- నేడుతో పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, సర్పంచ్ బోడపాటి బుల్లియ్య, సొసైటీ చైర్మన్ నారిన వీర వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు ఏడిద రామలక్ష్మీ, ఇన్‌చార్జిలు ముత్యాల నాగేశ్వరరావు, మొల్లేటి రామకృష్ణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వల్లూరులో పలు ఎస్సీ కాలనీల్లో బుధవారం సాయంత్రం మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు పర్యటించి సమస్యల పరిష్కారానికి నిధులు అందిస్తామన్నారు. అలాగే ఆచంట మండల భీమలాపురం గ్రామానికి చెందిన కట్టా వెంకటేశ్వర్లు కుమారుడు నేహాంత్ హర్ష కాలేయం వ్యాధితో బాధపడుతుండడంతో వైద్యానికి గానూ రూ.10 లక్షల సీఎంఆర్ఎఫ్ నుంచి ఎల్‌ఓసీ పత్రాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తూర్పుపాలెంలో అందజేశారు. మార్టేరులో కుల వృత్తి చేసుకోవడానికి స్థలాన్ని కేటాయించి, చెరువు తవ్వి అందించాలని బుధవారం తూర్పుపాలెంలో మార్టేరుకు చెందిన రజక సంఘ సభ్యులు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు విజ్ఞప్తి చేశారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి వేణుబాబు, తామడ సత్యనారాయణ, పత్తికాయల ప్రతాప్, వేయటి బుజ్జి, సైనవరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం



కొప్పర్రులో తాగునీటి పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు



వైద్య శిబిరంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం నరసాపురం మండలం కొప్పర్రు గ్రామంలోని ప్రజలకు శుద్ధి చేసిన మంచినీరు, పూర్తిస్థాయిలో నూతన పైపులైన్ ఏర్పాటుకు చేపట్టిన పనులను ప్రసాదరాజు ప్రారంభించారు. రూ.86.10 లక్షల వ్యయంతో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. కొప్పర్రు మేజర్ పంచాయతీ పరిధిలోని పాతమాలపల్లి, పెదపేట, కొప్పర్రు, మంగళగుంటపాలెం, మాదిగ గుడెం, శెట్టిబలిజపాలెం, రాజయ్యగర్వు, బద్దావారి పేట, కొత్తపేట మాలపల్లి తదితర తొమ్మిది నివాసిత ప్రాంతాల్లోని 2019 గృహాలకు మంచినీరు సమృద్ధిగా అందుతుందన్నారు. 1600 మీటర్ల మేర గ్రామంలో మంచినీటి పైపులైన్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. అదే విధంగా గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ఆరు అంగన్‌వాడీ సెంటర్ భవనాల పనులను పూర్తి చేయడం కోసం ఒక్కో భవనానికి రూ.5 లక్షలు చొప్పున మొత్తం రూ.30 లక్షలు కేటాయించామన్నారు. దీనిలో భాగంగా కొప్పర్రు బద్దావారిపేటలో నిర్మాణం పూర్తి చేసుకున్న అంగన్‌వాడీ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రసాదరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సెంటర్, పక్కనే ఉన్న మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల చిన్నారుల రక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రహరీ నిర్మించాలని బద్దావారిపేట వాసులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. స్పందించిన ప్రసాదరాజు ప్రహరీ నిర్మాణ పనులను నాడు-నేడులో చేపట్టే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. కొప్పర్రు గ్రామ అభివృద్ధికి ఈ ఐదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు కేటాయించామన్నారు. నూతన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను నిర్మించామన్నారు. కొప్పర్రు నుంచి మంగళగుంటపాలెం, కొప్పర్రు నుంచి మల్లవరం గ్రామాలను కలుపుతూ ఆర్అండ్‌బీ రహదారులను అభివృద్ధి చేశామన్నారు. ఇంత మేలు చేకూర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి దీవించాలని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్లి వరలక్ష్మీజేమ్స్, ఉపసర్పంచ్ అందే కవికుమార్, ఎంపీటీసీ సభ్యురాలు బద్దా శాంతకుమారి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, మండల పార్టీ అధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ, గ్రామపెద్దలు పోలిశెట్టి గోపీనాద్, రావి బ్రహ్మాజీ, ఇంజేటి జాన్‌కెనడీ, పోలిశెట్టి బాబా, పోలిశెట్టి మధు, చినిమిల్లి బాబులు, యాదంరెడ్డి సూరిబాబు, రాబర్ట్, జపాన్, పులఖండం సత్యనారాయణ, పులఖండం చిట్టిబాబు, కాకిలేటి మధు, కడలి రాంబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవిరాజు, లోకం నాని తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఆరోగ్య సమాజం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రయత్నం

నరసాపురం: ప్రజలు ముఖ్యంగా పేదవారు రోగాల బారిన పడకుండా పూర్తి ఆరోగ్య సమాజం వచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణంలోని పీచుపాలెం 10వ సచివాలయం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలు వైద్యం కోసం అప్పులపాలు కాకూడదనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని ముఖ్యమంత్రి బలోపేతం చేశారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఏఎన్ఎంలు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఎలాంటి ఫీజులు లేకుండా 14 రకాల వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వారం రోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి: కాజ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కాజ-కొత్త నవరసపురం, కాజ-చించినాడ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో కొత్త విద్యుత్ లైన్లు వేస్తున్న కారణంగా ఈ ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు వారం రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని నరసాపురం డివిజన్ ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సురేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన తెలిపారు. ఈ కారణంగా కలగంపూడి, ఏనుగువానిలంక, బాడవ చించినాడ గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులతో పాటు చెరువులకు కూడా అంతరాయం కలుగుతుందని ఆయన వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎం జగన్ కోసం ప్రార్థించండి



వైఎస్ విమలారెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కోసం పాస్టర్లంతా ప్రత్యేక ప్రార్థనలు చేయాలని అంతర్జాతీయ సువార్తికురాలు వైఎస్ విమలారెడ్డి కోరారు. పాలకొల్లు పట్టణంలోని శ్రీరామచంద్రగార్డెన్స్‌లో బుధవారం రాత్రి విమలారెడ్డి పాల్గొని సువార్త సందేశమిచ్చారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక సదస్సులో విమలారెడ్డి మాట్లాడుతూ దైవసేవకుడు ప్రతి ఒక్కరూ ప్రార్థన, స్తుతి, వాక్యం మూడు అంశాలను గుర్తుపెట్టుకోవాలన్నారు. నిరంతరం బైబిల్ పఠనం చేయడం వల్ల అంతులేని జ్ఞానం సంపాదించుకోవచ్చని చెప్పారు. ప్రస్తుత కాలంలో పేదలకు మేలు చేస్తున్న సీఎం జగన్‌ని ఓడించడానికి అనేక శక్తులు ఏకమవుతున్నాయని, ఈ సమయంలో జగన్‌కి అండగా నిలవాలని కోరారు. అనంతరం అడ్వైజర్ టు సీఎం(క్రిస్టియన్ అఫైర్స్) ఫాదర్ బాలస్వామి మాట్లాడుతూ క్రైస్తవులకు అనేక ప్రయోజనాలు కలిగే విధంగా సీఎం జగన్ పని చేస్తున్నారన్నారు. జెరూసలేం యాత్ర చేసే విశ్వాసులకు ప్రభుత్వం పారితోషికం పెంచిందని చెప్పారు. క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మేడిది జాన్సన్ మాట్లాడుతూ పాస్టర్ల గౌరవ వేతనం పెంచే ఆలోచన సీఎం జగన్ చేస్తున్నారన్నారు. సమావేశంలో జి.జ్యోతి ఆనంద్, కె.డేవిడ్ రాజు, జోహానస్ ప్రేమ్, పి.ప్రసాదరెడ్డి, పి.సంపదరావు, పాము లక్ష్మి, ఐ.సెయింట్ పాల్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర'



పాలకొల్లు అర్బన్: పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్



పెనుమంట్ర: మార్టేరులో వాలీబాల్ ఆడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి



పెనుగొండ: కొడమంచిలిలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

పాలకొల్లు అర్బన్: యువతలో క్రీడా నైపుణ్యం వెలికితీయడమే లక్ష్యంగా ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ చెప్పారు. పాలకొల్లు పట్టణంలోని శ్రీ ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, షటిల్ పోటీలను నిర్వహించడం వల్ల ప్రతిభను చాటుకోవడానికి యువతకు చక్కని వేదికన్నారు. ఈ పోటీల్లో వాలీబాల్ పురుషుల విభాగంలో యలమంచిలి, నగంచెరువు జట్లు తలపడగా యలమంచిలి జట్టు విజయం సాధించింది. వాలీబాల్ స్త్రీల విభాగంలో యలమంచిలి, పాలకొల్లు జట్లు పోటీపడగా యలమంచిలి విజయం సాధించింది. క్రికెట్ పురుషుల విభాగంలో యలమంచిలి జట్టు పాలకొల్లు జట్టుపై 105/66 పరుగుల తేడాతో విజయం సాధించింది. క్రికెట్ స్త్రీల విభాగంలో యలమంచిలి జట్టు పాలకొల్లు అర్బన్ జట్టుపై 25/6 విజయం సాధించింది. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు, యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ మోర్త గిరీష్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి మద్దా చంద్రకళ, సహాయ కార్యదర్శి కర్రా జయసరిత, యువ నాయకుడు గుడాల సాయిబాలాజీ, పార్టీ నాయకులు సాలా నరసయ్య, కోరాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: సమాజంలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి అన్నారు. బుధవారం నియోజకవర్గ స్థాయిలో మార్టేరు వేణుగోపాల ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రారంభమైన వాలీబాల్ మహిళా విభాగం పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేపడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యతో పాటు క్రీడలలో కూడా రాణించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలలో మహిళా విభాగంలో పెనుమంట్ర మండలం నెగ్గిపూడి, ఆచంట మండలం కొడమంచిలి, పోడూరు మండలం పోడూరు జట్ల మధ్య వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో నెగ్గిపూడి జట్టు ప్రథమ స్థానంలో నిలువగా, కొడమంచిలి జట్టు ద్వితీయ స్థానంలోనూ, పోడూరు జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. అదేవిధంగా కొడమంచిలిలో జరిగిన పురుషుల విభాగం వాలీబాల్ పోటీలలో పెనుమంట్ర మండలం పాలమూరు, ఆచంట, పెనుగొండ మండలం వడలి జట్ల మధ్య జరిగాయి. ఈ పోటీల్లో పాలమూరు జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, ఆచంట ద్వితీయ స్థానం, వడలి తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో పెనుమంట్ర మండలానికి చెందిన మహిళా విభాగంలో నెగ్గిపూడి జట్టును, పురుషుల విభాగంలో పాలమూరు జట్టును జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

పెనుగొండలో..

పెనుగొండ: ఆడుదాం ఆంధ్రతో గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రోత్సాహం అందిస్తున్నారని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. బుధవారం కొడమంచిలిలో ఆడుదాం ఆంధ్రలో భాగంగా నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రీడాకారులకు కావాల్సిన సదుపాయాలను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బాస్కెట్ బాల్ అంతర్జాతీయ క్రీడాకారుడు , నరసాపురం డీఎం సుభాష్ రెడ్డి, ఎంపీడీఓలు నరసింహప్రసాద్, శ్రీనివాస దరా, తహసీల్దార్లు సుబ్రహ్మణ్యం , ఇన్‌చార్జి కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ ములగాడ వరప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు యల్లమెల్లి బేబీ రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా బాలికల దినోత్సవం

పాలకొల్లు అర్బన్: సృష్టికి మూలాధారమైన స్త్రీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అద్దాల ప్రతాప్‌కుమార్ అన్నారు. జాతీయ బాలికాదినోత్సవం సందర్భంగా బుధవారం లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భ్రూణ హత్యలు అరికడదాం... బాలికలను బ్రతకనిద్దాం అంటూ బాలికలు నినాదాలు చేశారు. తల్లిదండ్రుల బాటలో నడుస్తూ ఉన్నత చదువులు చదుకుని సమాజంలో మంచి ఉన్నత స్థితికి చేరుకునేలా ప్రతీ స్త్రీ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి సత్యవేణి, హెచ్ఎం జీబీజే ప్రసాదు, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో పైపులైన్ పనుల ప్రారంభం



పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

యలమంచిలి: జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని మేడపాడు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మేడపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు అన్నారు. మేడపాడు గ్రామంలోని దూడేవారి పుంతలో ఉన్న జగనన్న కాలనీలో జల్ జీవన్ మిషన్ (జేజేఎం) నిధులు రూ.10 లక్షలతో వేస్తున్న పైపులను పనులకు ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభతో కలిసి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలనీకి ఇప్పటికే రోడ్డులు, విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముద్దల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు డేగల వెంకటేశ్వరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పులపర్తి సునీల్ పాల్గొన్నారు.

జేజీఎం పనులకు శంకుస్థాపన

పాలకొల్లు అర్బన్: మండలంలోని కొత్తపేటలో గురువారం ఉదయం 9 గంటలకు జలజీవన్ మిషన్ పనులకు ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు గ్రామ సర్పంచ్ కవురు భారతి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. సుమారు రూ.11కోట్లతో మండలంలోని 17 హేబిటేషన్‌లకు పైపులైన్‌ల ద్వారా సురక్షిత మంచినీరు అందించే ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు భారతి తెలిపారు.

యలమంచిలిలో..

యలమంచిలి: మండలంలోని ఐదు గ్రామాలలో పూర్తయిన పలు అభివృద్ధి పథకాలకు గురువారం ప్రభుత్వ చీఫ్‌విప్, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజుతో కలసి వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాత్తూరి బుచ్చిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బూరుగుపల్లి, గుంపర్రు, నారినమెరక, పెనుమర్రు, యలమంచిలి గ్రామాల్లో పూర్తయిన భవనాలను ప్రారంభిస్తారని వివరించారు.

సైకిల్ షెడ్ ప్రారంభం

యలమంచిలి: మండలంలోని కాజ తూర్పు గ్రామంలో ఉన్న పింగళి వెంకయ్య ఓరియంటల్ హైస్కూల్లో పూర్వ విద్యార్థులు, పరకాల ట్రస్ట్ ఆర్థిక సహకారంతో సైకిల్ షెడ్ నిర్మించారు. ఈ షెడ్‌ను బుధవారం ట్రస్ట్ చైర్మన్ పరకాల సూర్య మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కాజ తూర్పు సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి పనికి ప్రభుత్వ నిధులపై ఆధారపడకుండా దాతల సహకారం తీసుకుని అభివృద్ధి పనులు చేయడం ఆహ్వానించదగిన పరిణామం అన్నారు. కార్యక్రమంలో పరకాల ట్రస్ట్ ట్రస్టీ పరకాల రాజేశ్వరరావు, ఎంపీటీసీ జిల్లెళ్ల రత్నంరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొప్పినీడి సర్వేశ్వరరావు, హైస్కూల్ హెచ్ఎం మహ్మద్ లియాఖత్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాల నిలిపివేత

పెనుగొండ: నడిపూడిలో బుధవారం ఇసుక అమ్మకాలు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తుండగా అధికారులు నిలిపివేశారు. చెన్నైకు చెందిన కంపెనీకి ఇసుక తవ్వకాల టెండర్ దక్కిందంటూ వారి ప్రతినిధులు ఇసుక బాట వేసి బుధవారం అమ్మకాలకు యత్నించారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో అధికారులు స్పందించి నడిపూడిలో ఇసుక తవ్వకాలను నిలిపివేసి యంత్రాలను గట్టుపైకి చేర్చారు. తవ్వకాలకు అనుమతులు చూపి తవ్వకాలు ప్రారంభించుకోవాలని సూచించారు. ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్ పరిశీలించి అనుమతి పత్రాలు చూపాలని మైన్స్ అధికారులకు సూచించారు. గత నెలలోనూ ఇదేవిధంగా టెండరుకు సంబంధించిన కంపెనీ ప్రయత్నించింది. మరోసారి కూడా ఇలానే ప్రయత్నించడంతో అధికారులు తీవ్రంగా హెచ్చరికలు జారీ చేశారు. అనుమతి పత్రాలు వచ్చే వరకూ తవ్వకాలను అనుమతించేది లేదని తేల్చి చెప్పారు.